# బీమా..కొబ్బరి రైతుకు ధీమా

- ప్రీమియంలో 75 శాతం రాయితీ
- మూడేళ్లకు ఒకేసారి కట్టుకునే వెసులుబాటు
- మార్చి 31 వరకూ గడువు
- నియోజకవర్గంలో 3500 ఎకరాల్లో కొబ్బరి సాగు



తుని మండలం కుమ్మరిలోవలో కొబ్బరి తోటలు



జగ్గంపేట మండలంలో కొబ్బరి తోటలు పెంచుతున్న రైతులు

**తుని రూరల్/జగ్గంపేట:** ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణంలో సంభవించే మార్పుల కారణంగా నష్టపోయే కొబ్బరి రైతులకు ఇకపై బీమా రక్షణ కవచంలా మారనుంది. అరుగాలం శ్రమించి పెంచిన కొబ్బరి చెట్లకు నష్టం వాటిల్లితే రైతును ఆదుకునేందుకు కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు (సీడీబీ) ముందడుగు వేసింది. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌తో కలసి కొబ్బరి చెట్ల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. తక్కువ ప్రీమియంతో ఒకటి నుంచి మూడు సంవత్సరాల కాలానికి బీమా చేయించుకునే వెసులుబాటు కల్పించారు. రైతు వాటాగా 25 శాతం ప్రీమియం చెల్లిస్తే మిగిలిన 75 శాతంలో 50 శాతం సీడీబీ, 25 శాతం రాష్ట్రం చెల్లిస్తుంది. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే వేలాది మంది కొబ్బరి రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రైతు వాటా ప్రీమియం చెల్లించేందుకు మార్చి 31 వరకు గడువు విధించారు. కనీసం ఐదు ఆరోగ్యకరమైన చెట్లు ఉన్న స్థలంలో కొబ్బరి చెట్లకు బీమా చేయించుకునేందుకు అర్హత లభిస్తుంది. 30 చెట్లలో ఒకటి, వంద చెట్లలో రెండు, వందకుపైగా చెట్లలో మూడు చెట్లకు నష్టం వాటిల్లితే రైతులకు నష్టపరిహారం లభిస్తుంది. ఏదైన కారణంగా నష్టం వాటిల్లిన 15 రోజుల్లో అధికారుల ద్వారా కంపెనీకి తెలియజేయాలి. వెంటనే బీమా కంపెనీ ప్రతినిధులు వచ్చి నష్టం అంచనా వేస్తారు. అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే నెలరోజుల్లో పరిహారాన్ని రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

**నియోజకవర్గంలో ఇలా..**

తుని నియోజకవర్గంలో 3500 ఎకరాల్లో రైతులు కొబ్బరి సాగు చేస్తున్నారు. తుని మండలంలో 2400 ఎకరాలు, తొండంగిలో వెయ్యి ఎకరాలు, కోటనందూరు మండలంలో వంద ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. జగ్గంపేట నియోజకవర్గంలోని జగ్గంపేట, గండేపల్లి మండలాల పరిధిలో సుమారు 120 ఎకరాల్లో రైతులు కొబ్బరి తోటలు సాగు చేస్తున్నారు.

**బీమా వర్తించే అంశాలు**

తుపాన్లు, వడగండ్ల వాన, సుడిగాలి, భారీ వర్షాలు, వరదలు, వరద ముప్పు, చీడపీడలు వల్ల చెట్లకు నష్టం కలిగితే, అగ్నిప్రమాదాలు, మెరుపులతో కూడిన మంటలు, భూకంపాలు, కొండచరియలు విరిగి పడడం, సునామీ, తీవ్ర కరువు, చెట్టు మొత్తం నష్టపోవడం వంటి సందర్భాలలో బీమా వర్తిస్తుంది.

**బీమా వర్తించని అంశాలు**

దొంగతనాలు, యుద్ధాలు, అణుప్రతిచర్య, రేడియో ధార్మిక కాలుష్యం, ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం, మనిషి లేదా పక్షులు, జంతువులు వల్ల కలిగే నష్టాలు, నిర్వహణ సరిగా లేకపోవడం, సహజ నైతికత కోల్పోవడం వంటి అంశాలకు ఈ బీమా వర్తించదు.

**ప్రీమియం**

4 నుంచి 15 సంవత్సరాల వయసు గల ఒక చెట్టుకు ప్రీమియం రూ.9, బీమా రూ.900, 16–60 సంవత్సరాల ఒక చెట్టుకు ప్రీమియం రూ.14, బీమా రూ.1750 చెల్లిస్తారు.

**రాయితీ**

మొత్తం ప్రీమియంలో 50 శాతం కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 25 శాతం రైతు వాటాగా చెల్లిస్తారు. ఆసక్తి గల రైతులు ఏఐసీ ఎన్‌టీపీసీ అకౌంట్ నంబరు 918020054765243 (ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూటీఐబీ0000070)కు ప్రీమియం చెల్లించాలి.

**బీమాకు అవసరమైన పత్రాలు**

ఉద్యాన అధికారి నుంచి ప్రతిపాదిత దరఖాస్తు ఫారం, భూమి ధ్రువీకరణ పత్రం, చెట్లపై నంబర్లు వేసి నమూనా పత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నకళ్లు.

### కొబ్బరి రైతులకు మేలు



బీమా పథకంతో కొబ్బరి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. రైతులు ముందుగా బీమా పథకంపై అవగాహన పెంచుకోవాలి. ఆసక్తి ఉంటే ఉద్యానశాఖ అధికారులు, సిబ్బందిని కలిసి పూర్తి వివరాలు తెలుసుకోవాలి. తక్కువ ప్రీమియంతో బీమా చేయించుకునే సౌలభ్యం ప్రస్తుతం రైతులకు అందుబాటులోకి వచ్చింది. దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

–లావణ్య, డివిజన్ ఉద్యాన అధికారి, జగ్గంపేట

### బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

75శాతం రాయితీతో అమలవుతున్న కొబ్బరి బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యాన అధికారుల సలహాలు, సూచనలతో నేరుగా రైతులు బీమా ప్రీమియాన్ని చెల్లించుకోవచ్చు. మరిన్ని వివరాలను రైతు సేవా కేంద్రాల్లో ఉద్యాన సహాయకులు, మండల కేంద్రంలో ఉద్యాన అధికారులను సంప్రదించాలి. బీమాపై రైతుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు మండలాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

– జి.విజయలక్ష్మి, ఉద్యాన అధికారి, తుని.

### 17 ఎకరాలకు బీమా చేయించాను



కొబ్బరి చెట్లకు బీమా చేయడం ఇదే ప్రథమం. దీని వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఎకరాకు సుమారు 600 చెట్లు పెంచుతాం. నేను 17 ఎకరాల్లో కొబ్బరి తోట వేశాను. మొత్తం చెట్లకు బీమా చేయించాను. కోనసీమ తుపాన్ వచ్చినప్పుడు కొబ్బరికి తీవ్ర నష్ట కలిగింది. అలాంటి ప్రకృతి వైపరీత్యాలు వస్తే బీమాతో రైతులకు లబ్ధి చేకూరుతుంది.

–డీవీఎస్ రామరాజు, మల్లిపాక,జగ్గంపేట మండలం

## నేడు శివకేశవుల విగ్రహ ప్రతిష్ఠ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట:** ఇర్రిపాకలోని ఏలేరు నదితీరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి శివకేశవుల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఇర్రిపాకలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఇర్రిపాకలో ఏలేరునది తీరాన్ని శివకేశవుల క్షేత్రంగా తీర్చిదిద్దాలని శృంగేరి పీఠాధిపతి చేసిన సూచనతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. తుని తపోవనం స్వామీజీ, వివిధ పీఠాధిపతులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. విగ్రహ ప్రతిష్ఠలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**స్వామివార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు**

ఇర్రిపాకలో గత ఐదు రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో భాగంగా ఆదివారం వేంకటేశ్వరస్వామి, కోటిలింగేశ్వస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ప్రయాణికుడికి బ్యాగ్ అందజేత



లగేజీ బ్యాగ్‌ను ప్రయాణికుడు నాయక్‌కు అందజేస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్యాం త్రినాథరావు

**అన్నవరం:** రైలులో పోగొట్టుకున్న బ్యాగును బాధితుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు వెతికి అతనికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే... ఉద్యోగంలో చేరేందుకు భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ఐక్య నాయక్ అనే యువకుడి లగేజీ బ్యాగ్‌ను పొరబాటున పెళ్లి బృందం సభ్యులు అన్నవరంలో తమ లగేజీతో పాటు ప్లాట్‌ఫారం మీద దించేశారు. రైలు అన్నవరం నుంచి కొంత దూరం వెళ్లాక నాయక్ తన లగేజీ బ్యాగ్‌ను చూడగా లేకపోవడంతో తుని జీఆర్‌పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఆ బ్యాగ్‌లో సర్టిఫికెట్లు, ఇతర విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయని తెలిపాడు. దీంతో ఎస్ఐ అన్నవరం జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్యాం త్రినాథరావుకు ఫోన్ చేయగా ఆయన పెళ్లి బృందం లగేజీ తనిఖీ చేసి నాయక్ బ్యాగ్‌ను గుర్తించారు. దానిని బాధితుడికి అందజేశారు.

### బాధితులకు ఆర్థిక సాయం

**రౌతులపూడి:** మండలంలోని పి.చామవరంలో ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు కామిరెడ్డి నాగేశ్వరరావు, పోతల రాజులను ఎంఎంఆర్ ట్రస్టు అధినేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముదినూరి మురళీకృష్ణంరాజు ఆదివారం పరామర్శించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. లచ్చిరెడ్డిపాలెంలో కొండరాజుల బాబు పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాల్లో ఆయన పాల్గొన్నారు. ఉత్సవ కమిటీకి రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విస్తృతంగా తనిఖీలు



తునిలో పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐలు గీతారామకృష్ణ, చెన్నకేశవరావు

**తుని:** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు తనిఖీలు(నాకాబందీ) నిర్వహించారు. తుని పట్టణ, రూరల్ సీఐలు గీతారామకృష్ణ, చెన్నకేశవరావు ఆధ్వర్యంలో 50 మంది పోలీసు సిబ్బంది ఐదు బృందాలుగా ఏర్పడి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ వివిధ ప్రాంతాల్లో వాహనాలు, లాడ్జీలను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని 19 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రికార్డులు, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్సులో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

**ప్రత్తిపాడు:** జాతీయ రహదారిపై స్థానిక సంతోషిమాత ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. యర్రవరం నుంచి ప్రత్తిపాడు వస్తున్న ఆటోను కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే...రంగంపేటకు చెందిన ఆటో డ్రైవర్ శివమణికంఠ జగ్గంపేట నుంచి ప్రత్తిపాడు వస్తున్నాడు. ఈ ఆటోలో అనకాపల్లి జిల్లా పాయకరావు పేటకు చెందిన షేక్ అబ్బాస్, ఏలేశ్వరం మండలం చిన్నింపేటకు చెందిన శేషమ్మ ప్రయాణిస్తున్నారు. జాతీయ రహదారిపై స్థానిక సంతోషిమాత ఆలయం వద్ద ఆటో రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి పశివేదల వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న షేక్ అబ్బాస్, శివమణికంఠ, శేషమ్మలు, కారులో ఉన్న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పశివేదలకు చెందిన వీరవెంకట సత్యనారాయణ, పద్మావతి, హేమలతలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. క్షతగాత్రులకు సీహెచ్‌సీ వైద్యుడు రఘురాం చికిత్స చేసి పోలీస్‌లకు సమాచారం అందించారు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఆటోను ఢీకొన్న కారు



కారు ఢీకొనడంతో బోల్తా పడిన ఆటో

**ప్రత్తిపాడు:** జాతీయ రహదారిపై మండలంలోని ధర్మవరం సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. ఉల్లిపాయ లోడుతో ప్రత్తిపాడు నుంచి కత్తిపూడి వైపు వెళ్తున్న ఆటోను ధర్మవరం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన డ్రైవర్ నిలుపుదల చేశాడు. కాగా రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ వెళ్తున్న కారు నిలిచిఉన్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడగా, డ్రైవర్ మొయిళ్ల శివకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు.

### నిందితుడికి 14 రోజుల రిమాండ్

**జగ్గంపేట:** మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి పెద్దాపురం కోర్టు రిమాండ్ విధించినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాజపూడికి చెందిన ఎస్ఆర్ కృష్ణ అదే గ్రామానికి చెందిన వివాహిత పట్ల అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించడంతో ఎస్సై రఘునాథరావు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించగా పెద్దాపురం సబ్‌జైలుకు తరలించినట్టు తెలిపారు.

## పొగమంచుతో ముప్పే

- శీతాకాలం ముగుస్తున్నా వీడని మంచు, చలి
- మంచులో తిరిగితే జలుబు, జ్వరం వచ్చే అవకాశం
- దీర్ఘకాలిక రోగులకు జాగ్రత్తలు తప్పనిసరి



ప్రత్తిపాడులో ఇళ్లను కమ్మేసిన పొగమంచు

**ప్రత్తిపాడు రూరల్:** శీతాకాలం ముగుస్తున్నా పల్లెలను చలి, మంచు వీడటం లేదు. గత వారం రోజులుగా ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. మధ్యాహ్న సమయంలో వేడి ఎక్కువగా ఉంటోంది. కాగా ప్రతిరోజూ ఉదయం, రాత్రి వేళల్లో పొగమంచు వర్షంలా కురుస్తోంది. వేకువజామున పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి చలి, పగటి పూట ఎండతో వాతావరణం విచిత్రంగా మారింది. ఈ నేపథ్యంలో చలి, పొగమంచులో తిరిగితే శ్వాస కోస వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

**నియోజకవర్గంలో..**

నియోజకవర్గంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 75 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో పదేళ్ల లోపు చిన్నారులు సుమారు 67 వేల మంది వరకు ఉన్నారు. మంచు ఎక్కువగా కురువడంతో చిన్నారుల ఆరోగ్యం విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.


**పోస్టు కోవిడ్ రోగుల్లో దుష్ఫలితాలు**

పోస్టు కోవిడ్ రోగుల్లో వేర్వేరు దుష్ఫలితాలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. కొందరిలో సుగర్ లెవెల్స్ విపరీతంగా పెరుగుతున్నాయి. మరి కొందరికి గుండె సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంకొందరు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. పోస్టు కోవిడ్ రోగులు అప్రమత్తంగా ఉండకపోతే శ్వాస కోస ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- పొగమంచు, చలి ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు అప్రమత్తంగా ఉండాలి.
- దగ్గు, జలుబు, ఆయాసం వంటివి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- తెల్లవారుజామున కాకుండా ఎండ వచ్చిన తర్వాత వాకింగ్ చేస్తే మంచిది.

### మంచులో తిరగవద్దు



గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయం మంచు అధికంగా కురుస్తోంది. దీనివల్ల చిన్నారులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. మంచులో తిరిగితే జలుబు, జ్వరం వస్తున్నాయి. జ్వరం రెండు రోజుల కంటే ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యులకు చూపించాలి. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మంచులో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

–డాక్టర్ కొవ్వూరి మురళీమోహన్‌రెడ్డి, వైద్యాధికారి, శాంతిఆశ్రమం, ప్రత్తిపాడు మండలం

## అధ్వానంగా జీఎల్‌ఆర్ ట్యాంకులు

- సమీపిస్తున్న వేసవికాలం
- నీటిఎద్దడి లేకుండా చూడాలని కోరుతున్న ప్రజలు



పెద్దవీధిలో జీఎల్ఆర్ ట్యాంకు



అప్పన్నపాలెంలోని జీఎల్ఆర్ ట్యాంకు వద్ద పేరుకుపోయిన నాచు

**ఏలేశ్వరం:** పట్టణవాసులకు తాగునీరు అందించే జీఎల్ఆర్ ట్యాంకులు అధ్వానంగా ఉండడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీటి చుట్టు నాచు పేరుకుపోవడంతో తాగునీరు పట్టుకునేందుకు స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణ పరిధిలోని పోలీస్‌స్టేషన్ సమీపం, పెద్దవీధి, అప్పన్నపాలెంలో జీఎల్ఆర్ ట్యాంకులు ఉన్నాయి. వీటి చుట్టు పైపులు ఏర్పాటు చేయగా వాటిలో సగానికిపైగా పనిచేయడం లేదు. దీనికి తోడు అపరిశుభ్రంగా ఉండడంతో తాగునీరు పట్టుకునేందుకు మహిళలు సుముఖత చూపడం లేదు. ఒకప్పుడు తాగునీటి కోసం వీటి వద్ద ప్రజలు క్యూ కట్టేవారు. ప్రస్తుతం వీటి జోలికి వెళ్లేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు ఈ ట్యాంక్‌లకు నీళ్లు పట్టే మోటార్ల వద్ద సిబ్బంది కొరత ఉండడంతో ట్యాంకు నిండిన తాగునీరు వృథాగా పోతోంది. ట్యాంకుల వద్ద తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకొనే నాథుడే లేడని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకొని వీటిని పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. కాగా వేసవికాలం సమీపిస్తుండడంతో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**వృథాగా పోతున్న తాగునీరు**

పట్టణంలో కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. కాగా పైప్‌లైన్లకు రంధ్రాలు పడటంతో తాగునీరు వృథాగా పోతోంది. పైపులు వేసి ఏళ్లు పూర్తికావడంతో తుప్పుపట్టి తాగునీరు లీకవుతోంది. పైపులు డ్రైన్లలో నుంచి ఉండడంతో కుళాయిల ద్వారా మురుగునీరు వస్తోందని మహిళలు ఆరోపిస్తున్నారు. గతంలో పైపుల నుంచి మురుగునీరుతో పాటు తోకపురుగులు వచ్చాయని, మళ్లీ అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## క్లుప్తంగా

### వాకర్ల ఆరోగ్యానికి ప్రాధాన్యం



తునిలో వాకర్లకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆదినారాయణ

**తుని:** వాకర్ల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్థానిక సిటీ వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్ సీహెచ్ సోమేశ్వరరావు తెలిపారు. స్థానిక గణపతినగర్ పార్కు వద్ద సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎన్.ఆదినారాయణ 70 మంది వాకర్లకు బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎల్.అప్పారావు, ఉపాధ్యక్షుడు ఎం.శివ, కార్యదర్శి రాజు, ట్రెజరర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### అదృశ్యమైన బాలికలు తల్లిదండ్రుల చెంతకు..

**జగ్గంపేట:** మండలంలోని జె.కొత్తూరు గ్రామానికి చెందిన ఇద్దరు పదో తరగతి విద్యార్థినులు ఆదివారం పాఠశాలలో జరిగే ప్రత్యేక తరగతులకు వెళ్లి వస్తామని చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. విద్యార్థినులు పాఠశాలకు రాలేదని స్కూల్ యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు అదృశ్యమైన సంగతి వెలుగు చూసింది. కాగా తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగ్గంపేట ఎస్సై రఘునాథరావు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేవలం గంటలోనే వారి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సై రఘునాథరావుకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

### పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి



మండపంలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

**శంఖవరం:** ప్రతిఒక్కరూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం కోరారు. మండలంలోని మండపంలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వాటర్ ట్యాంక్‌ల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాణిక్యం మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

### బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శికి సత్కారం



సిరిపురంలో శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

**ఏలేశ్వరం:** మండలంలోని సిరిపురంలో ఆదివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లా శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. భారతరత్న, మాజీ ప్రధాని వాజ్‌పేయ్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీనివాస్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని వాజ్‌పేయ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కందా వీరస్వామి, గున్నాబత్తుల రాజబాబు, మణికంఠ, నూకరాజు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పట్టపగలే విద్యుత్ వెలుగులు



హెచ్.కొత్తూరులో నిత్యం వెలుగుతున్న వీధిలైట్లు

**తుని రూరల్:** గ్రామాల్లోని వీధిలైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉంటున్నాయి. పంచాయతీలు రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు చెల్లిస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నాయి. కళ్లెదుటే పగలు వీధి దీపాలు వెలుగుతున్నా.. రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అవుతున్నా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు మాకెందుకులే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఎనిమిదేళ్ల కిందట సాధారణ లైట్లు తొలగించి ఎల్ఈడీ లైట్లు అమర్చారు. అప్పటి నుంచి ఇదే పరిస్థితి. హెచ్.కొత్తూరు, లోవకొత్తూరు, జగన్నాథగిరి, హంసవరం, తదితర గ్రామాల్లో పగలు, రాత్రులు అని తేడా లేకుండా నిరంతరం లైట్లు వెలగడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీధి లైట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.